



నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 52,256 మంది పట్టభద్రులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు వేయనున్న 776 మంది ఓటర్లు
- పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ఉత్తరాంధ్ర పట్టభద్రుల, జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగనుంది. ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని శ్రీకాకుళం డివిజన్‌కు సంబంధించి శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో, టెక్కలికి సంబంధించి ఆర్‌డిఒ కార్యాలయం, పలాసకు సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎన్నికల్లో పాల్గొనే పిఒలు, ఎపిఒలు, ఒపిఒ తదితర సిబ్బంది ఆదివారం సాయంత్రానికే తమకు కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ మొదలై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు 59 కేంద్రాలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 52,256 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 36,421 మంది, మహిళా ఓటర్లు 15,839, ఇతరులు ఐదుగురు ఉన్నారు. వీరిలో శ్రీకాకుళం డివిజన్‌లో 29,631 మంది, టెక్కలి డివిజన్‌లో 11,103 మంది, పలాస డివిజన్‌లో 11,522 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లావ్యాప్తంగా 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంలో 33, టెక్కలిలో 12, పలాసలో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు మొత్తం 57,433 బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణకు 17 జోన్లు, 27 రూట్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు కోసం 75 మంది పిఒలు, 75 మంది ఎపిఒలు 150 ఒపిఒలను నియమించారు. 75 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు.

నందిగాంలో అత్యధిక మంది ఓటర్లు

నందిగాం జిల్లాపరిషత్ హైస్కూల్‌లోని రూమ్ నెంబరు ఐదు పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 1366 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 1018 మంది ఉండగా మహిళలు 347 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూమ్ నంబరు 11 పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 415 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 313 మంది పురుషులు, 102 మంది మహిళలు ఉన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కాన్ఫరెన్స్ హాల్ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 487 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నందిగాం పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 1018 మంది పురుష ఓటర్లు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు 776 మంది ఓటర్లు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నాలుగు చోట్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస, పాలకొండ డివిజన్లలోని ఆయా ఆర్‌డిఒ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 776 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ కోసం 919 బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. పది మంది పిఒలు, 20 ఎపిఒలను నియమించారు.


పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

పటిష్ట పోలీసు భద్రత

పోలింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల కోసం 27 మొబైల్ పార్టీలు, 17 స్ట్రైకింగ్ ఫోర్స్, నాలుగు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 30 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 30 ఎంసిసి బృందాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఆరు రోప్ పార్టీలు, ఇద్దరు స్ట్రాంగ్‌రూమ్ గార్డులు, మూడు రిజర్వు పార్టీలను నియమించారు.

ఇలా వేయకూడదు

- సొంత పెన్నును ఉపయోగించకూడదు.
- ఒకే నంబరు ఇద్దరు అభ్యర్థులకు ఇవ్వకూడదు.
- ఒకటి, రెండు, వన్, టు అని అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పత్రంపై ఓటరు రాసే నంబర్లను పెన్నుతో గట్టిగా రుద్దకూడదు.
- అభ్యర్థి పేరు, బాక్స్ పక్కన కాకుండా మరే ఇతర ప్రదేశాల్లో నంబర్లు వేసినా ఆ ఓటు చెల్లదు.
- 1 వేయకుండా మిగతా నంబర్లు వేసినా ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు.
- అభ్యర్థులందరికీ ఓటు వేయాలనే నిబంధన లేదు. ప్రాధాన్యతా క్రమంలో కొందరికి వేసినా సరిపోతుంది.

ఇలా వేయాలి

- బ్యాలెట్ పత్రం మీద అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఓటరు మొదటి ప్రాధాన్యం ఇచ్చే వారి పేరు ఎదురుగా 1, 2, 3 నంబర్లు గానీ రోమన్ అంకెలు గానీ వేయొచ్చు.
- పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ను మాత్రమే వినియోగించాలి.
- పోలింగ్ కేంద్రానికి వెళ్లేటప్పుడు ఓటరు గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి.
- పోలింగ్ బూత్ లోపలకు వెళ్లే ముందు పేరు సరిచూసుకుని సంతకం పెట్టాలి. బూత్ బయట ఓటరు జాబితాలో పేరు, క్రమసంఖ్య చూసుకోవాలి.

అంకెలతోనే ఓటు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక విధానం సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా ఉంటుంది. బ్యాలెట్ పత్రం ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. బ్యాలెట్ పత్రంపై ఎలాంటి గుర్తులు ఉండవు. అభ్యర్థుల పేర్లు, ఫొటోలు మాత్రమే ఉంటాయి. ఓటరు అభ్యర్థుల పేరుకు ఎదురుగా అంకెతోనే ఓటు వేయాలి. ప్రాధాన్యతా క్రమంలో అందరికీ ఓటు వేయొచ్చు.

నేటి నుంచి ఫీవర్ సర్వే

- ఫ్లూ తీవ్రతపై అప్రమత్తం
- ఎక్కువ మంది కి జ్వరముంటే ఆసుపత్రికి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రుల్లో చేరిన వారూ పెరుగుతున్నారు. ఫ్లూ తీవ్రతకు హెచ్3ఎన్2 వైరస్ వ్యాప్తి కారణమేమోననే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అన్ని రాష్ట్రాలను తాజాగా అప్రమత్తం చేసింది. పెరుగుతున్న ఫ్లూ కేసులపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. ఫలితంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం పది రోజుల పాటు జిల్లాలో గ్రామ గ్రామాన ప్రత్యేక వైద్య బృందాలతో ప్రతి ఇంటికీ వెళ్లి ఈ సర్వే చేపట్టనున్నారు. ఏ ఇంట్లో ఎందరు జ్వర పీడితులు ఉన్నారో గుర్తించి, వారికి తక్షణం వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జ్వరం బారిన పడిన వ్యక్తి లక్షణాలు పరిశీలించి రక్త పరీక్షలు చేయించడం తద్వారా మలేరియా, డెంగ్యూ కాకుండా ఇతర వైరస్ బారిన ఏమైనా పడ్డారా? అనేది తేల్చనున్నారు. సర్వే ద్వారా ఫ్లూ జ్వరాల వ్యాప్తి నివారించడంతో పాటు కొత్త వైరస్‌గా అనుమానిస్తున్న హెచ్3ఎన్2 గురించి కూడా ముందుగానే తెలుసుకునేలా కసరత్తు చేస్తున్నారు. వాస్తవానికి గడచిన కొన్ని వారాలుగా జిల్లావ్యాప్తంగా జ్వరాలు పెరిగిపోయాయి. జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు ప్రయివేటు ఆస్పత్రులకు జ్వర పీడితులు వస్తున్నారు. ఒక్క జిజిహెచ్‌కు రోజూ వందకు పైగా జ్వరంతో వణుకుతూ వస్తున్నారు. అదే సమయంలో ఫ్లూ పంజా విసురుతున్న నేపథ్యంలో కొత్త వైరస్ వేరియంట్ ప్రభావం ఉందేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కేంద్రం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేయడంతో వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఫీవర్ సర్వే చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించాలని, తద్వారా కొత్త వేరియంట్‌గా అనుమానిస్తున్న వైరస్‌కు సంబంధించి లక్షణాలు బయటపడే అవకాశం ఉందని ఆదేశించారు. సోమవారం నుంచి ఆయా సచివాలయాల పరిధిలో వాలంటీర్, ఎఎన్ఎం, ఆశావర్కర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికీ వెళ్లనున్నారు. పది రోజుల్లో జిల్లావ్యాప్తంగా అన్ని కుటుంబాల వద్దకు వెళ్లి ఫీవర్ సర్వే పూర్తి చేయనున్నారు. గతంలో కోవిడ్ వ్యాప్తి సమయంలో ఇటువంటి సర్వేలు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని, అందువల్ల అదే తరహాలో ఫీవర్ సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి జ్వరంతో ఆయా కుటుంబాల్లో ఎంతమంది బాధపడుతున్నారో తెలుసుకుని లక్షణాల ఆధారంగా పరీక్షలు చేయించనున్నారు. ప్రస్తుతం జ్వరాల తీవ్రత చిన్నారులు, వృద్ధుల్లో మరింత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఏదైనా ఇంట్లో ఒకటికి మించి ఎక్కువ మందికి జ్వరాలు ఉంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఆస్పత్రులకు పంపించేందుకు సిద్ధమవుతున్నారు.

హాల్ టిక్కెట్లు ఇవ్వకుంటే క్రిమినల్ చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఫీజులు కట్టలేదన్న నెపంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లను కళాశాల యాజమాన్యాలు నిరాకరిస్తే సంబంధిత కళాశాలలపై క్రిమినల్ చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యా సంవత్సరం కోల్పోయినట్లు ఫిర్యాదు వస్తే, ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను మానసికంగా ఫీజుల పేరిట వేధిస్తున్నట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. అటువంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు నిర్వహించే ప్రతి కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు, వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు లేకపోవడం పైనా ఫిర్యాదు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్, ఎస్‌పి, ఆర్ఐఒకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635 తో పాటు apscpcr2018@gmail.com కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస, శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయాల్లో నాలుగు పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టభద్రుల ఓటర్లు 56,256 మంది ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఓటర్లు 776 మంది ఉన్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఓటర్లకు ఇప్పటికే ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలను తెలియజేసినట్లు స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బందికి కొరత లేదన్నారు. పోలింగ్‌కు గంట ముందు అభ్యర్థులకు సంబంధించి ఏజెంట్లు చేరుకోవాలని, చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఎలక్షన్ కమిషన్ సూచనల ప్రకారం పోలింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. పోలింగ్ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సాగుతుందని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా ఓటరు స్లిప్పు అందకపోతే, తమ పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకొని ఓటరు గుర్తింపుకార్డు తీసుకువెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

నగరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాలలో సామగ్రి తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, శ్రీకాకుళం ఆర్‌డిఒ బి.శాంతితో మాట్లాడారు. అనంతరం టిపిఎం స్కూల్‌లో ఎన్నికల ఏర్పాట్లను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బందికి ఆహార ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ ఎన్.వెంకటరావును ఆదేశించారు. తాగునీరు, వైద్య సదుపాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిపిఒ రవికుమార్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, మెప్మా పీడీ కిరణ్ పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జల్లు లక్ష్మణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, ప్రవేశాలకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు అర్హులని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుంటాయని పేర్కొన్నారు.

జిల్లాలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన వారై ఉండాలని తెలిపారు. బిసి, ఇబిసి విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2010 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదని స్పష్టం చేశారు.

జిల్లాలో బిసి గురుకుల పాఠశాలల వారీగా అంపోలు (బాలురు) 80, అక్కుపల్లి (మత్స్యకార బాలురు) 40, నరసన్నపేట (బాలురు) 40, నిమ్మాడ (బాలురు) 40, సంతబొమ్మాళి (బాలురు) 40, లోలుగు (బాలురు) 40, టెక్కలి (బాలికలు) 80, శ్రీకాకుళం (బాలికలు) 40, పలాస (బాలికలు) 40, పాతపట్నం (బాలికలు) 40, ఆమదాలవలస (బాలికలు) 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

31లోగా పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం



2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, నీటి పన్నుతో పాటు ఖాళీ స్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు, ప్రకటనల పన్ను, టెంపరరీ ఎక్రోచ్‌మెంట్ పన్నులను ఈనెల 31వ తేదీ లోగా చెల్లించాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటరులో పన్నులను చెల్లించి రశీదులను పొందాలని తెలిపారు. మార్చి 31వ తేదీ లోగా పన్నులను చెల్లించకుంటే 24 శాతం అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల నగరపాలక సంస్థలో విలీనమైన పెద్దపాడు, చాపురం, కిల్లిపాలెం, తోటపాలెం, ఖాజీపేట, కుశాలపురం, పాత్రునివలస ప్రజలూ ఈ పన్నులను చెల్లించాలని తెలిపారు.

నేడు ఎస్‌పి స్పందన రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఎస్‌పి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులలు, స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని ప్రకటనలో కోరారు. వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని కోరారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి


డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం



వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. వేసవిలో వడదెబ్బ ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానంపై ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

వడదెబ్బ అంటే పరిసరాల్లో ఎక్కువ ఉష్ణోగ్రత వల్ల శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమవడం. చాలా వేడి వాతావరణంలో సరైన మోతాదులో ద్రవపదార్థాలను తీసుకోకుండా చురుకైన పనులు చేసినప్పుడు కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. వేసవిలో మండే ఎండల నుంచి ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. ముఖ్యంగా చిన్నారులు ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలి. అత్యవసర పనులు ఉంటే తప్ప మధ్యాహ్న వేళల్లో బయట తిరగకూడదు. వడ గాడ్పులు వల్ల ప్రజలు డిహైడ్రేషన్‌కు గురవుతారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోతే ప్రాణాలకే ప్రమాదం. శరీరం ఎంత నీటినైతే కోల్పోతుందో అంతకంటే రెట్టింపు నీటిని శరీరానికి అందించాలి. ఈ నేపథ్యంలో నిత్యం నీళ్లు, ఇతర ద్రవపదార్థాలు తీసుకోవాలి.



వడదెబ్బ ప్రభావం

చెమట పట్టకపోవడం, శరీరం పొడిబారడం, తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం, వృద్ధులు, చిన్నారులు, ఆటగాళ్లు, ఎండలో ఎక్కువసేపు పని చేసే కార్మికులు ఎక్కువగా ఈ వడదెబ్బకు గురవుతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నీళ్లు, కొబ్బరినీళ్లు, ఒఆర్ఎస్ ద్రావణం, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. కాఫీలు, ఆల్కహాల్‌లు ఎక్కువగా తీసుకోరాదు. చల్లని నీటితో స్నానం, వదులైన దుస్తులు ధరించాలి. కాటన్ దుస్తులు ధరిస్తే మంచిది. బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ పెట్టుకోవాలి. లేక గొడుగును వాడాలి. బయట పని చేసేవారు తలకు తలపాగా ధరించాలి.

చికిత్స: వడదెబ్బకు గురయ్యే వ్యక్తికి గాలి, వెలుతురు బాగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. చల్లని నీటితో ఒళ్లంతా ఒత్తాలి. తాగడానికి చల్లని మజ్జిక, లేక కొబ్బరి నీళ్లు, లేక ఒఆర్ఎస్ ఇవ్వాలి. నోటి ద్వారా తాగలేని పరిస్థితిలో దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి, తగిన చికిత్స అందించాలి.

పారదర్శకంగా ఎన్నికల విధులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం


మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఎన్నికల విధులపై నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆదివారం దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో ఇద్దరు అదనపు ఎస్‌పిలు, ముగ్గురు డిఎస్‌పిలు, ఎనిమిది మంది సిఐలతో పాటు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక దళాలు, ఆర్మ్డ్ పోలీసులు, స్పెషల్ పార్టీలు సుమారుగా 800 పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను నియమించామన్నారు. జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రారంభమై పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రపరిచే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సుమారుగా వంద మీటర్ల వరకు ఎవరూ గుంపులుగుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరూ రూట్ అధికారులు, మొబైల్ అధికారులతో పాటు ఇన్‌ఛార్జి అధికారుల ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నా తక్షణమే అధికారులకు తెలియజేయాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు తరలించే సమయంలో పటిష్ట భద్రతా ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు మొబైల్ పార్టీలను రూట్ అధికారులు అలర్ట్ చేసి సక్రమంగా బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లను క్రమపద్ధతిలో అనుమతిస్తూ మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, సంయమనం పాటిస్తూ వ్యవహరించాలన్నారు. ఓటర్లను పూర్తిగా తనిఖీ చేసి ఓటర్ స్లిప్, ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును మాత్రమే ఓటరుతో పాటు పోలింగ్ బూత్ లోపలకు అనుమతించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీస్ సిబ్బంది పోలింగ్ బూత్ లోపలికి వెళ్లరాదని స్పష్టం చేశారు. పిఒ, ఎపిఒ పిలిస్తేనే పోలింగ్ బూత్ లోపలికి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.మహేంద్ర, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

ఆధునిక మార్పులను అన్వయించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : వైద్య రంగంలో అత్యాధునిక మార్పులను అన్వయించుకునేందుకు వీలుగా ఎప్పటికప్పుడు చర్చ జరగాలని, అప్పుడే మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలు పడుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల ఎనస్తీషియాలజీ విభాగం హెడ్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. నగరంలోని రిమ్స్ వైద్య కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనస్తీషియాలజీ ఆధ్వర్యాన ఆదివారం జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాప్రోస్కోపిక్ సర్జరీలు, చెవి, ముక్కు గొంతు సర్జరీల్లో ఏనస్తియా వినియోగించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. లేకుంటే రోగి నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల శాస్త్ర సాంకేతిక వైద్యవృత్తిలో వస్తున్న మార్పులపై జాగ్రత్తగా వ్యవహరిస్తూ రోగికి మేలు చేకూర్చే విధంగా ఉఫయోగించాలన్నారు. శస్త్ర చికిత్సల్లో వస్తున్న మార్పులు, మారుతున్న రోగ కారకాలు, రోగి స్థితిని గుర్తించడం ద్వారా తగిన మెలకువలు పాటించవచ్చన్నారు. లాప్రోస్కోపిక్, చెవి, ముక్కు, గొంతు వంటి సర్జరీల సమయం అనుసరించాల్సిన విధానాలపై వైద్యులు, వైద్య విద్యార్థులు మెలుకువలు నేర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రంగనాథం, ఆంధ్రా, తెలంగాణా, దక్షిణాదీ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎనస్తీషియా వైద్యులు పాల్గొన్నారు.

మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం


పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశు వైద్యాధికారులు

సంతబొమ్మాళి : వ్యాక్సిన్ వికటించి మృతి చెందిన 15 గొర్రెలకు టెక్కలి పశు సంవర్ధకశాఖ ఎడి రఘునాథ్, శ్రీకాకుళం ఎడిటిఎల్ ఎడి కిశోర్ ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రి అప్పన్నకు చెందిన గొర్రెలకు సచివాలయ వెటన్నరీ అసిస్టెంట్ ఇచ్చిన షీప్ ఫాక్స్ వ్యాక్సిన్ వేయడంతో 15 గొర్రెలు చనిపోయాయి. దీనిపై పశు సంర్ధకశాఖాధికారులు గ్రామాన్ని సందర్శించి మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. సిబ్బంది వ్యాక్సిన్ చేయకుండా గొర్రెల యాజమానులకు ఎలా వ్యాక్సిన్ ఇచ్చారని సిబ్బందిపై మండిపడ్డారు. అస్వస్థతకు గురైన గొర్రెలకు ఐదు రోజుల పాటు చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటు న్నట్లు ఎడి రఘునాథ్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఇదిలా ఉండగా గొర్రెల బీమా జనవరితో ప్రభుత్వం నిలిపివేయడంతో బాధిత రైతులకు నష్టపరిహారం అందే అవకాశం కనిపించడం లేదు. 15 గొర్రెలు మృతితో సుమారు రూ.3లక్షలు నష్టపో యామని, గొర్రెలే తనకు జీవనాధరమని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కర్రి అప్పన్న అధికారుల వద్ద మొరపెట్టుకున్నాడు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు నీతివంతమైన పాలన అందించడంతో పాటు సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో వైసిపి ఆవిర్భవించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు కోరుకునే పాలన అందించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సఫలీకృతమయ్యారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో ఉన్న నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సిఎం కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ముందుగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం మాజీ ఎంపీ డి.వి.జి.శంకరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అంధవరపు సూరిబాబు, అంధవరపు సంతోష్, పైడి మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.

రణస్థలం : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ జెండాను ఎగురవేశారు. జెడ్‌పిటిసి టొంపల సీతారాం, అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్ బాబు, నాయకులు భవిరి రమణ, చిల్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : పార్టీ జెండాను ఎగరవేస్తున్న ధర్మాన

ఆమదాలవలస : వైసిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని బొడ్డేపల్లిపేటలోని తన కార్యాలయంలో వైసిపి నాయకులు సువ్వారి గాంధీ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ, పేడాడ వైకుంఠరావు, బొడ్డేపల్లి మన్మథరావు, బగాది నేతాజీ, రాజశేఖర్, యండ షణ్ముఖరావు, పైడి విజయ్, రాజేష్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని పెదలింగలవలసలోని ఎచ్చెర్ల నియోజకవర్గ జగనన్న ప్రజాసేవ కార్యాలయం ఆవరణలో వైసిపి నాయకులు లుకాలాపు అప్పలనాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, మజ్జి సత్యం, గొర్లె సూర్యనారాయణ, నాగరాజు, పి.గురునాయుడు, శ్రీను పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక భయ్యాల కల్యాణ మండపంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రదరావు జెండాను ఆవిష్కరించారు. కేక్‌ను కట్ చేసి పేదలకు పళ్లను అందజేశారు. వైసిపి నాయకులు లోతుగెడ్డ తతబాబు, చల్లా ధర్మారావు, సవర రమేష్, లోతుగెడ్డ ఇందిరారాం, అంపిలి ప్రశాంత్‌కుమార్, పొట్నూరు మధుబాబు, పడల వెంకటకృష్ణ, కె.తిరుపతిరావు, టి.వెంకటరావు పాల్గొన్నారు.

నందిగాం: ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్లాన భైరాగి, వైస్ ఎంపిపిలు ఆర్.కూర్మారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ ప్రజా ప్రస్థాన విజయ స్తూపం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేకును కోసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్, ఎంపిపి బోర పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ చల్ల సుగుణ, జెడ్‌పిటిసి నారాయణమ్మ, బాబురావు, తాడి ఆదిరెడ్డి, లాభాల స్వర్ణమణి, ఉలాల దివ్య భారతి, సయ్యద్ సుల్తాన్, దేవరాజ్, పి.సంతు, బి.ప్రకాష్, పి.కోటి, బి.జగన్, ఆర్.చిట్టిబాబు, ఆశి పురుషోత్తం, కె.త్రినాథ్, పితాంబర్‌రెడ్డి, ఢిల్లీరావు, పాల్గొన్నారు.


ఆమదాలవలస : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

మెళియాపుట్టి: వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కేకును కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనరు పాడి అప్పారావు, ఆదినాయుడు, ఎ.రాజశేఖర్‌రెడ్డి, కన్నబాబు, చంద్రరావు, గౌరీష్, రవికుమార్ పాల్గొన్నారు.


రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం పాటు జిల్లా రాజకీయాల్లో అలుపెరుగని నాయకునిగానే కాక జిల్లాను అభివృద్ధి పథం నడిపించిన నాయకులు మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. నగర శివారుల్లోని కొత్తరోడ్డు కూడలి వద్ద రాజకీయాలకు అతీతంగా ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన బిఆర్ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళింగ సామాజిక తరగతి అభివృద్ధికే కాక, పార్లమెంటేరియన్‌గా సుదీర్ఘ కాలం పాటు జిల్లాకు సేవలందించారన్నారు. వంశధార నదిపై గొట్టాబ్యారేజీ నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆరుసార్లు ఎంపీగా జిల్లాలో నెగ్గిన ఏకైక నాయకుడని కొనియాడారు. జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి తన వంతు పాత్ర పోషించారన్నారు. ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారం ఏర్పాటు, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలో ఆయన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆమదాలవలస మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్, సువ్వారి గాంధీ, ఆమదాలవలస జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, సనపల అన్నాజీరావు, టిడిపి సీనియర్ నాయకులు చౌదరి నారాయణమూర్తి, డాక్టర్ రామ్మోహనరావు, ఎస్ఎస్ఆర్ ఛారిట్రబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వృద్ధులకు మిఠాయిలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సురేష్


శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న స్పీకర్ సీతారాం

పలాస : జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు ద్వారా వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావుకు దక్కుతుందని మాజీ ఎంపీ డాక్టర్ కె.విశ్వనాథ్ అన్నారు. బిఆర్ శతజయంత్యుత్సవాలు పలాస కళింగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బాబూరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబు చౌదరి, మెట్ట రామారావు, శ్రీహర్ష వేణుగోపాల్, మాధవరావు, నాగేశ్వరరావు, బి.నాగరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మానవసేవే మాధవ సేవ అని సన్ రైస్ హాస్పిటల్ అధినేత వైద్యులు బొడ్డేపల్లి సురేష్ అన్నారు. మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని వృద్ధ మానసిక వికలాంగుల నిలయానికి బియ్యాన్ని అందించారు.

తమ్ముడిపై అన్న దాడి

ప్రజాశక్తి- పలాస


గాయపడిన చంద్రశేఖర్

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పల్లి వీధికి చెందిన జోగ చంద్రశేఖర్‌పై ఆయన అన్న జాగా మన్మథరావు, వదిన సుహాసిని, వదిన తల్లి ఊర్వశి, తమ్ముడు రాకేష్ దాడి చేయడంతో గాయపడ్డాడు. తమ పాత ఇంటికి మరమ్మతులు చేస్తున్న సమయంలో అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. చంద్రశేఖర్‌ను వారు రాళ్ళ, కర్రలతో కొట్టారు. గాయపడిన చంద్రశేఖర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసు అధికారి శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అగ్నిమాపక సిబ్బందితో అశోక్, రుద్రయ్య తదితరులు

జీడి తోటల్లో అగ్ని ప్రమాదం

యువకుల చొరవతో తప్పిన ముప్పు

ప్రజాశక్తి- కవిటి

మండల కేంద్రంలోని కొత్త కాలనీ సమీపంలోని జీడి తోటల్లో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. తక్షణమే స్పందించి యువకులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం జీడి, కొబ్బరి తోటల్లో అగ్నికీలలు ఎగసిపడుతున్న విషయం తెలుసుకున్న పొల్లాయి డిజిటల్ అసిస్టెంట్ పొల్లాయి అశోక్, ఆరోగ్యశ్రీ కార్యకర్త పి.మోరేసు రుద్రయ్య ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అగ్నికీలలు ఎగిసిపడుతుండటంతో సామాజిక మాధ్యమం, ఫోన్‌లో గ్రామంలోని యువకులను అప్రమత్తం చేశారు. వారి సహాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో సోంపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. యువకులు వెంటనే స్పందించకపోతే భారీగా ఆస్తి నష్టం సంభవించేదని రైతులు, గ్రామస్తులు చెప్తున్నారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు. విఆర్‌ఒలు పార్వతి, నారాయణ, విఆర్‌ఎ కాళీ మంటలు అదుపు చేసేందుకు సహకారం అందించారు.

మద్యం, సారా పట్టివేత

కొత్తూరు : ఒడిశా రాష్ట్రం అడ్డుబంగి నుంచి కొంతమంది వ్యక్తులు 33 మద్యం బాటిళ్లు, 20 లీటర్ల నాటుసారాను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ ఎం.గోవింద్ తెలిపారు. మండలంలోని మతాల చెక్ పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పలాస: మండలంలోని లొద్దభద్ర గ్రామానికి చెందిన టి.లక్ష్మీనారాయణ గడ్డివామి ఆదివారం దగ్ధమైంది. ఆకుతాయిలు ఎవరో సిగరెట్ పీక పారేయడం వల్లే మూడు ఎకరాల గడ్డివామి దగ్ధమైందని బాధితులు ఆరోపిస్తున్నాడు. ఘటన జరిగిన వెంటనే పలాస అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం చేరడంతో హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 25 వేలు నష్ట జరుగుతుందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- లావేరు

లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పి.జ్యోతి ప్రథమ, ఎస్.రాము ద్వితీయ, ఆర్.లలిత తృతీయ బహుమతులు గెలుపొందారు. అనంతరం గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, పాఠకులు పాల్గొన్నారు.


బహుమతులతో విద్యార్థులు


ఆర్థికసాయం అందిస్తున్న మాతృమూర్తి సభ్యులు


ఆర్థికసాయం అందిస్తున్న గోవిందరావు

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

ఆర్థిక సమస్యలతో చదువుకు ఇబ్బందులు పడుతున్న ఓ విద్యార్థికి మండలంలోని కుసుం పురం మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు అండగా నిలిచారు. హైదరాబాద్‌లోని చింతల్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగుడు యలమట్టి మహేష్ చదువులో చురుగ్గా ఉండేవాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంటో మహేష్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకు ఆటంకం ఏర్పడింది. దీంతో స్నేహితుల ద్వారా మాతృమూర్తి యువజన సంఘం సభ్యులను కలిసి తన పరిస్థితి వివరించాడు. దీనిపై తక్షణమే స్పందించిన యువజన సేవా సంఘం రూ.5వేలను సంస్థ సభ్యులు బొడ్డు నవీన్, బాబ్జీ, స్వామీ, ప్రవీణ్ మహేష్‌కు ఆదివారం అందించారు.

ఎంజిఆర్...

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన బోను నాగమ్మ కుమార్తె మనీషా వివాహానికి టిడిపి సీనియరు నాయకుడు మామిడి గోవిందరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం నాగమ్మ కుమార్తె వివాహానికి వెళ్లి సాయం అందించారు. ఆయనతో పాటు ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, వెలమల గోవిందరావు, పి.కూర్మారావు, ఎంజిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉమా కవికి ఉగాది పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న ఉమా కవి

శ్రీకాకుళం అర్బన్ : జాతీయ శతాధిక ఉగాది సమ్మేళనంలో భాగంగా శ్రీకాకుళం సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షుడు డాక్టర్ భోగెల ఉమామహేశ్వరరావుకు కోనసీమ జిల్లా అమలాపురం సర్ సి.వి.రామన్ కళాశాలలో ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటి ఆవృతానికి గ్రూప్ లీడర్‌గా గుర్తించి సత్కరించారు. ఉమా కవి 'ఉగాది వచ్చింది... ఉషస్సులు ఎన్నో తెచ్చింది' అనే కవితను చదివి వినిపించారు. ఈ మేరకు ఈ పురస్కారాన్ని శ్రీశ్రీ కళావేదిక జాతీయ, అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ చేతులు మీదుగా అందజేశారు.

సభను విజయవంతం చేయాలి


రామ్మోహనరావు

ఆమదాలవలస : ఈ నెల 14న మచిలీపట్నంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని, అవి ఇంకా ఎంతో కాలమూ కొనసాగవని అన్నారు. ఇప్పటికే వైసిపి ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం: ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పారా మెడికల్ సిబ్బందికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్తారు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిహెచ్‌సిలు, మెడికల్ క్లీనిక్స్‌లో పారా మెడికల్ సిబ్బందికి ఉద్యోగాలు కల్పిస్తామని జగన్ హామీ ఇచ్చారని అన్నారు. ఆ మేరకు జిఒ 429 అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను యూనియన్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జి.ప్రసాదబాబు, ఎం.చిరంజీవి, చలపతి, నిరంజన్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


సూచనలు చేస్తున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగే పోలింగ్ తీరుపై వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ పార్టీ నేతలకు సూచనలు చేశారు. ఆదివారం రాత్రి పార్టీ నేతలతో మాట్లాడారు. సోమవారం అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు చేశారు. పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలకు రెండు ఓట్లు ఉన్న వ్యక్తులు ప్లాన్ ప్రకారం ఓట్లు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రకాశరావు పట్నాయక్, సాలీనా ఢిల్లీ, చిట్టిబాబు, పిలక సంతోష్, ప్రేమ్‌కుమార్, కేదారి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- పలాస

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి తెలిపారు. డివిజన్ పరిధిలో 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, డివిజన్ పరిధిలో 11522 ఓట్లు ఉండగా పురుషులు 7932, స్త్రీలు 3589 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి పిఒలు 14, ఎపిఒలు 14, ఒపిఒలు 28 మందిని నియమించడం జరిగిందని చెప్పారు. మైక్రో అబ్జర్వర్లు, 14 వెబ్ కాస్టింగ్, 14 రూట్ ఆఫీసర్లు, 8 జోనల్ అధికారులను నియమించామన్నారు. అన్నీ పోలింగ్ కేంద్రాలకూ పూర్తి స్థాయిలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పలాస తహశీల్దార్ కార్యాలయంలో వద్ద స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్‌డిఒ తెలిపారు. పలాస డివిజన్ పరిధిలో 212 ఓటర్లు ఉన్నారని చెప్పారు. అందుకు సంబంధించి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు.

ఆమదాలవలస : ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు నియోజకవర్గ ఎఆర్‌ఒ ఎస్.గణపతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఉన్నత పాఠశాలలో 43, 43-ఎ, 44, 45 మొత్తం కలిపి నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది చొప్పున నాలుగు కేంద్రాలకు 24 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాలుగు కేంద్రాల పరిధిలో 3,123 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఆదివారం ముమ్మర ఏర్పాట్లు అధికారులు చేపట్టారు. పోలింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తహశీల్దార్ ఎస్.రాంబాబు తెలిపారు. మండలం పరిధిలోని 2,583 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని రూమ్ నంబరు 28లో 62వ పోలింగ్ బూత్, 29లో 62ఎ, 30లో 63, 11లో 64 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ లక్ష్మణరావు, జోనల్ అధికారులు బి.బాబి ఉన్నారు.


పొందూరు : ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


పలాస : అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ

జి.సిగడాం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్ఐ చామంతుల రామారావు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. ఘర్షణకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందిన దళితుడు, వాలీబాల్ ఆటగాడు లింగాల నరేంద్రకుమార్‌ను హత్య చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి లింగాల గరికివాడు డిమాండ్ చేశారు. నగరంలోని రిమ్స్ ఆస్పత్రి మార్చురీ వద్ద బిఎస్‌పి, దళిత సంఘాల జెఎసి ఆధ్వర్యాన ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10న నరేంద్రకుమార్ ఇంటి అదే గ్రామానికి చెందిన వ్యక్తులు వెళ్లి మీ కుమారిడిని హత్య చేస్తామని తల్లిదండ్రులకు హెచ్చరించారని అన్నారు. అందులో భాగంగానే హత్య చేసి పొందూరు సమీపాన ఉన్న రైల్వే ట్రాక్‌పై పడేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంట్లన రామారావు, డి.గణేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బొడ్డేపల్లి సీతారాం, కల్లేపల్లి కృష్ణ, మహాలక్ష్మి, చిత్తిరి లక్ష్మణరావు, లింగాల రామలక్ష్మి, లింగాల నిర్మల పాల్గొన్నారు.


హోరాహోరీగా సాగుతున్న పోటీలు

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కవిటి: మండలంలోని భైరిపురం గ్రామంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొత్తం 8జట్లు పోటీలో పాల్గొన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కృష్ణ జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి.

పైడితల్లి అమ్మవారి జాతర ప్రారంభం

పొందూరు: పొందూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారిని భక్తుల దర్శనానికి సిద్ధం చేశారు. ఉదయం నుంచే యాత్రికులు బారులు తీరారు. సాయంత్రం అమ్మవారిని పొందూరు పట్టణంలో ఊరేగించారు. మహిళలు పెద్దసంఖ్యలో ముగ్గులతో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయానికి వెళ్లే దారి పొడుగునా యాత్రికులకు ఆలయ కమిటీ సభ్యులు తాగునీటి మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

గురుకులంలో 'కన్నవారి దీవెన'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తల్లిదండ్రులపై, గురువులపై విద్యార్థుల్లో గౌరవభావం పెంపొందించుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పిలుపునిచ్చారు. పెద్దపాడు సమీపాన గల గురుకులంలో కన్నవారి దీవెనలు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల నుంచి దీవెనలు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.మృత్యుంజయరావు, పిజిటి వి.లావణ్య, ఫిజిక్స్ లెక్చరర్ ఎం.రాజేశ్వరి, అధ్యాపకులు సిహెచ్.మాలతి, ఎం.నాగమణి, ఎస్.పుష్పవేణి, జి.రమణయ్య పాల్గొన్నారు.


విద్యార్థినులను దీవిస్తున్న తల్లులు

చల్లవానిపేటలో యథేచ్ఛగా ఆక్రమణలు

చల్లవానిపేట జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. చెరువు గట్టును సైతం విడిచి పెట్టడం లేదు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు. ఆక్రమణలను అరికట్టాల్సిన రెవెన్యూ సిబ్బంది, కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతోనే ఆక్రమణలు జోరందుకుంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రజాశక్తి- జలుమూరు

చల్లవానిపేట జంక్షన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఖాళీగా ఉన్న ప్రదేశాలను ఆక్రమణదారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. జంక్షన్ వద్ద రోడ్డుకు పక్కనే ఉన్న ఈశ్వరప్ప కోనేరు, కోనేరు గట్టును సైతం విడిచిపెట్టడం లేదు. కోనేరు గట్టుకు వెళ్లాలంటే మార్గం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చల్లవానిపేట జంక్షన్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. జంక్షన్ వద్ద ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కోనేటి గట్టుకు వెళ్దామన్నా వీలు లేని పరిస్థితి ఉందని మహిళా ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారులు వివిధ దుకాణాలను ఏర్పాటు చేసి వాటి చెత్తా చెదారాలను కోనేరులో వేయడం వల్ల అవి నీటిలో కుల్లి దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది చూసీ, చూడనట్లు వ్యవహరిస్తూ ఆక్రమణదారుల వద్ద నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


కోనేరు గట్టుకు అడ్డంగా వేసిన ఓ షాపు